సాక్షి నిజామాబాద్

బుధవారం । 1 । అక్టోబర్ । 2025



అధిక వర్షాలతో పరేషాన్..

అధిక వర్షాలు రైతులను పరేషాన్ చేస్తున్నాయి. భూగర్భ జలాలు అధికమై పంట భూముల్లో నీరు ఉబికి వస్తోంది.

- 10లో ▸



సమస్య ఏదైనా..

సామాజిక మాధ్యమాల వినియోగంలోకి ప్రభుత్వ శాఖలు చేరాయి. ఆన్‌లైన్‌లోనే సలహాలు, సూచనలు ఇస్తున్నాయి.

- 10లో ▸

గరిష్టం/కనిష్టం 34.8 /21.0

వాతావరణం

ఉదయం ఆహ్లాదకరంగా ఉంటుంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. ఎండ తీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

వాతావరణ పరిస్థితుల మేరకు వరికోతలు చేపట్టాలి



బోధన్‌: వాతావరణ పరిస్థితుల మేరకు వరి కోతలను ప్రారంభించాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గోవింద్ రైతులకు సూచించారు. ఎడపల్లి మండలంలోని జైతాపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం గోదాములో ఎరువుల నిల్వలను డీఏవో మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో ఎక్కడా యూరియా కొరత లేదని స్పష్టం చేశారు. వచ్చే యాసంగి సీజన్‌లో పంటల సాగుకు నానో యూరియా వాడాలని, దిగుబడి పెరుగుతుందని రైతులకు సూచించారు. ఆయన వెంట ఏవో సిద్ధి రామేశ్వర్, ఏఈవో శ్రీహరి, సొసైటీ సిబ్బంది ఉన్నారు.

నేడు ఇందూరులో పీసీసీ చీఫ్ పర్యటన

- రెండురోజుల పాటు నగరంలోనే..
- దసరా ఉత్సవాల్లో పాల్గొననున్న మహేశ్ కుమార్‌గౌడ్

నిజామాబాద్ సిటీ: పీసీసీ చీఫ్ బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్ బుధవారం నగరంలో పర్యటించనున్నట్లు జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు విపుల్ గౌడ్ తెలిపారు. మున్సిపల్ కార్పొరేషన్, నుడా ఫండ్ నుంచి కేటాయించిన నిధులతో నిర్మించనున్న సీసీ డ్రైన్‌లు, సీసీ రోడ్లు, స్ట్రామ్ వాటర్ డ్రైన్స్ పనులను ప్రారంభిస్తారు. అమ్మనగర్ బ్రిడ్జిని ప్రారంభించనున్నారు. కంఠేశ్వర్ ఆలయ పాలకమండలి కార్యక్రమంలో పాల్గొననున్నారు. సాయంత్రం 5 గంటల తర్వాత ఆర్ అండ్‌బీ అతిథి గృహంలో కార్యకర్తలు, పార్టీ నాయకులకు అందుబాటులో ఉండనున్నట్లు విపుల్‌గౌడ్ తెలిపారు. గురువారం జరిగే దసరా పండుగ వేడుకలో సైతం పీసీసీ చీఫ్ పాల్గొననున్నట్లు పేర్కొన్నారు.

వైన్‌షాపులకు ఏడు దరఖాస్తులు

ఖలీల్‌వాడి: జిల్లాలోని వైన్‌షాపులను లక్కీ డ్రా ద్వారా కేటాయించేందుకు దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ కొనసాగుతోందని ఎక్సైజ్ సూపరింటెండెంట్ కొమ్మూరి మల్లారెడ్డి తెలిపారు. మంగళవారం ఏడు దరఖాస్తులు అందాయన్నారు. నిజామాబాద్, ఆర్మూర్, మోర్తాడ్ ఎక్సైజ్ స్టేషన్‌ల పరిధిలో రెండు చొప్పున, భీమ్‌గల్ స్టేషన్ పరిధిలో ఒక దరఖాస్తు అందిందని వివరించారు. ఇప్పటి వరకు మొత్తం 9 దరఖాస్తులు అందాయన్నారు.

చెత్త వేరుచేసే ప్రక్రియను వేగవంతం చేయాలి



నిజామాబాద్ సిటీ: చెత్తను వేరే చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని మున్సిపల్ రీజినల్ డైరెక్టర్ మసూద్ సూచించారు. నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నాగారంలో ఉన్న డంపింగ్‌యార్డును మంగళవారం సాయంత్రం ఆయన పరిశీలించారు. డంపింగ్‌యార్డు ఇన్‌చార్జి ప్రభదాస్‌తో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఆయనవెంట డిప్యూటీ కమిషనర్ డీఈ ముస్తాక్ అహ్మద్, శానిటరీ సూపర్‌వైజర్ సాజిద్ అలీ తదితరులున్నారు.

రిజర్వేషన్లు మారేనా?

స్థానిక సంస్థల రిజర్వేషన్ల అంశం హైకోర్టులో ఉన్న నేపథ్యంలో సర్వత్రా ఆసక్తి నెలకొంది. ప్రస్తుతం ప్రభుత్వం ప్రకటించిన రిజర్వేషన్లలో అనుకూలంగా ఉన్న స్థానాలు ఎక్కడ మారుతాయోనని పరిషత్, పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేయాలనుకుంటున్న ఆశావహుల్లో ఉత్కంఠ నెలకొంది. రిజర్వేషన్లపై హై కోర్టులో ఈ నెల 8న వాదనలు ఉండగా, మరుసటి రోజు నుంచే ఎంపీటీసీ, జెడ్పీటీసీ మొదటి విడత ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల కానుంది. అధికార యంత్రాంగం నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను మొదలు పెట్టేందుకు అంతా సిద్ధం చేసుకుంది.

- పరిషత్, సర్పంచ్ స్థానాలకు పోటీ చేయాలనుకుంటున్న వారిలో ఇదే చర్చ
- బంతి హైకోర్టులో ఉండడంతో ఏమవుతుందోననే ఉత్కంఠ
- 8న కోర్టులో వాదనలు.. 9న పరిషత్ తొలివిడత నామినేషన్ల ప్రక్రియ కావడంతో ఆశావహుల్లో ఆందోళన
- మరోవైపు పార్టీ కోసం ఏళ్లతరబడి కష్టపడితే అవకాశాలు దక్కలేదంటున్న అధికార పార్టీ నాయకులు
- సుప్రీంకు సైతం కేసు వెళ్తుందంటున్న నేపథ్యంలో తర్జన భర్జనలు



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: స్థానిక సంస్థల రిజర్వేషన్లు.. షెడ్యూల్ విడుదల.. హైకోర్టులో కేసు.. సుప్రీం కోర్టుకు సైతం కేసు వెళ్లనుందనే వార్తల నేపథ్యంలో రిజర్వేషన్లు మారుతాయా? అనే చర్చ అన్ని పార్టీల శ్రేణుల్లో సాగుతోంది. ఎక్కడ చూసినా.. ఏ ఇద్దరు కలిసినా.. ఫోన్లలో మాట్లాడుకున్నా ఇవే సంభాషణలు జరుగుతున్నాయి. ఇక పోటీ చేయాలనుకుంటున్న వారిలో ఈ అంశం ఉత్కంఠను రేపుతోంది. వ్యవహారం హైకోర్టులో ఉండడం, దీనిపై ఈ నెల 8న వాదనలు జరుగనున్న నేపథ్యంలో ప్రతిఒక్కరిలో ఆసక్తి నెలకొంది. పైగా కోర్టు నుంచి ఎలాంటి ఆదేశాలు వస్తాయో అనే విషయమై ఆశావహుల్లో ఆందోళన నెలకొనగా.. మరోవైపు మరుసటి రోజు నుంచే ఎంపీటీసీ, జెడ్పీటీసీ మొదటి విడత ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్ విడుదల, నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ మొదలు పెట్టేందుకు యంత్రాంగం సిద్ధం అయ్యింది.

దీంతో పరిణామాలు ఎలా మారుతాయోనని ముఖ్యంగా ఎన్నికల బరిలో నిలవాలనుకుంటున్న ఆశావహులు పరేషాన్ అవుతున్నారు. ఇదిలా ఉండగా డబ్బులు ఖర్చు చేయక తప్పని పరిస్థితి నెలకొనడంతో గందరగోళానికి గురవుతున్నారు. ఇక హైకోర్టు తీర్పును బట్టి సుప్రీం కోర్టుకు సైతం వెళ్లే అవకాశాలు ఉన్నాయని కొందరు అధికార పార్టీ నాయకులే మాట్లాడుతుండడం గమనార్హం.

అధికార పార్టీ నేతల్లో నిరాశ

ఏళ్ల తరబడి పార్టీ కోసం పనిచేసి, గత పదేళ్లలో పలు కేసులు ఎదుర్కొన్నప్పటికీ తమకు పోటీ చేసే అవకాశాలు దక్కలేదని పలువురు అధికార పార్టీ నాయకులు గగ్గోలు పెడుతున్నారు. ఎంపీపీ స్థానం దక్కించుకునే అవకాశం ఉన్నప్పటికీ ఎంపీటీసీ స్థానంలో పోటీ చేసేందుకు అనుకూలంగా రిజర్వేషన్లు దక్కకపోవడంతో ఆయా మండలాల కీలక నాయకులు నిట్టూరుస్తున్నారు. ఎంపీటీసీ స్థానం అనుకూలంగా వచ్చినప్పటికీ ఎంపీపీ పీఠంపై కూర్చునేందుకు అవకాశాలు లేకపోవడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికార పార్టీకి చెందిన కీలక బీసీ నేత జెడ్పీ చైర్మన్ పీఠం దక్కించుకునేందుకు తగిన ఏర్పాట్లు చేసుకున్నారు. జెడ్పీటీసీ అనుకూలంగా వచ్చినప్పటికీ చైర్మన్ పీఠం బీసీ మహిళకు కేటాయించడంతో నిరాశ చెందుతున్నారు. అదేవిధంగా జెడ్పీ పీఠం ఆశించిన పలువురు ముఖ్య నేతలు సైతం అవకాశాన్ని కోల్పోయామని మదన పడుతున్నారు. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్‌లకు చెందిన పలువురు నాయకులు తమ భార్యలను బరిలోకి దించే అవకాశాలు ఉన్నప్పటికీ అంతగా ఆసక్తి చూపడం లేదు. ఆచితూచి అడుగేసేందుకే మొగ్గు చూపుతున్నారు.

ఈటల వ్యాఖ్యలతో..

మహారాష్ట్రలో గతంలో స్థానిక ఎన్నికలు జరిగిన తరువాత సైతం కోర్టు రద్దు చేసిందంటూ మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ వ్యాఖ్యలు చేసిన నేపథ్యంలో తాజా షెడ్యూల్, కోర్టు తీర్పు ఎలా వస్తుందోననే చర్చ జరుగుతోంది. మొదటి విడత నామినేషన్ల గడువు సమీపిస్తుండడం, ముందురోజే కోర్టులో వాదనలు ఉన్నందున వ్యవహారం ఎలాంటి మలుపులు తీసుకుంటుందోననే ఉత్కంఠ నెలకొంది. దీంతో డబ్బులు ఖర్చు చేసే విషయంలో ఆచితూచి వ్యవహరించాలని ఆయా పార్టీల నాయకులు, బరిలో నిలిచేందుకు సిద్ధమైనవారు నిర్ణయించుకున్నారు. అయినప్పటికీ దసరా దావత్‌లు, అనుచరుల కోసం ఖర్చు చేయక తప్పని పరిస్థితి నెలకొందని చెబుతున్నారు. మొత్తంమీద షెడ్యూల్ వచ్చినప్పటికీ బంతి హైకోర్టులో ఉన్నందున ఎన్నికల వాతావరణంలో గతానికి భిన్నమైన ప్రత్యేకత నెలకొంది.

ఈనెల 5 నుంచి ధాన్యం సేకరణ



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి, పాల్గొన్న అధికారులు

- కొనుగోలు కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి
- అధికారులు సమన్వయంతో పని చేయాలి
- కలెక్టర్ టి వినయ్‌కృష్ణారెడ్డి

నిజామాబాద్ అర్బన్: కొనుగోలు కేంద్రాలను అందుబాటులోకి తీసుకువచ్చి ఈనెల 5వ తేదీ నుంచి ధాన్యం సేకరణ సజావుగా సాగేలా అంకితభావంతో కృషి చేయాలని కలెక్టర్ టి వినయ్ కృష్ణారెడ్డి ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో మంగళవారం సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముందస్తుగా నాట్లు పూర్తి చేసిన ప్రాంతాల్లో పంట దిగుబడి వస్తున్న దృష్ట్యా కొనుగోలు కేంద్రాలు రైతులకు అందుబాటులోకి తెచ్చేలా అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయా ప్రాంతాల్లో ధాన్యం సేకరణ కేంద్రాలు అందుబాటులో ఉండే విధంగా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని అన్నారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని, అవసరమైన అన్నిమౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. తేమ కొలిచే యంత్రాలు, టార్పాలిన్లు, తూకం యంత్రాలతోపాటు హమాలీలను అందుబాటులో ఉంచాలన్నారు. నాణ్యతా ప్రమాణాలకు లోబడి ధాన్యం తీసుకువచ్చే రైతులకు ప్రభుత్వం ప్రకటించిన మేరకు పూర్తి స్థాయి మద్దతు ధర అందేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని స్పష్టం చేశారు. సంబంధిత శాఖల అధికారులందరూ సమష్టిగా, సమన్వయంతో పనిచేస్తూ ధాన్యం సేకరణ ప్రక్రియను విజయవంతం చేయాలన్నారు. అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, డీఎస్‌వో అరవింద్‌రెడ్డి, సివిల్ సప్లయీస్ డీఎం శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా సహకార శాఖ అధికారి శ్రీనివాస్, జిల్లా వ్యవసాయ అధికారి జె గోవిందు, మార్కెటింగ్ శాఖ ఏడీ గంగుబాయి పాల్గొన్నారు.

ఇన్‌ఫ్లో 720 టీఎంసీలు..

- ఎస్సారెస్పీ చరిత్రలో మూడోసారి రికార్డు స్థాయి వరద!
- 1983, 1988 తరువాత ఇదే అత్యధికం
- ఇప్పటికీ కొనసాగుతున్న ఇన్‌ఫ్లో



గోదావరిలోకి విడుదలవుతున్న నీరు

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఈ ఏడాది ఇప్పటి వరకు రికార్డు స్థాయిలో 720 టీఎంసీల వరద వచ్చి చేరింది. 1983లో 1165 టీఎంసీలు, ఆ తరువాత 1988లో 912.95 టీఎంసీల ఇన్ ఫ్లో వచ్చింది. ఈ ఏడాది వచ్చిన వరద మూడో అతిపెద్ద ఇన్‌ఫ్లోగా ప్రాజెక్టు చరిత్రలో నిలిచింది. సెప్టెంబర్‌లోనే 400 టీఎంసీల ఇన్‌ఫ్లో రాగా, ఇప్పటికీ ఎగువ నుంచి వరద కొనసాగుతూనే ఉంది. 3.8 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం ఎగువన మహారాష్ట్రలో ఉన్న బాబ్లీగేట్లను అక్టోబర్ 28వ తేదీన మూసివేస్తే వరదకు బ్రేక్ పడుతుంది. ఈ లెక్కన మరో 27 రోజుల పాటు వరద వస్తుంది. ఈనెలలో సైతం భారీ ఇన్‌ఫ్లో కొనసాగితే పాతరికార్డును సైతం తిరగరాసే అవకాశం ఉంది.

660 టీఎంసీల అవుట్ ఫ్లో

ప్రాజెక్ట్ నుంచి ప్రస్తుత సంవత్సరం 660 టీఎంసీల నీటిని వరద గేట్లు, కాలువల ద్వారా ఇప్పటి వరకు విడుదల చేశారు. అందులో 570 టీఎంసీల నీరు గోదావరికిలోకి వెళ్లింది. అంటే ప్రాజెక్ట్ నీటి నిల్వ సామర్థ్యం కన్నా 5 రెట్ల నీరు గోదావరికి వెళ్లిపోయింది.

ఎన్నికల నిర్వహణకు సన్నద్ధం కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

- కోడ్‌ను పక్కాగా అమలు చేయాలి
- అధికారులతో కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

నిజామాబాద్‌అర్బన్: స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు అన్ని విధాలుగా సన్నద్ధం కావాలని కలెక్టర్ టి వినయ్ కృష్ణారెడ్డి సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని కాన్ఫరెన్స్ హాలులో ఎంపీడీవోలు, ఎంపీవోలతో కలెక్టర్ మంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎలక్షన్ కోడ్ పక్కాగా అమలయ్యేలా చూడాలని, నియమ, నిబంధనలపై పూర్తి అవగాహన కలిగి ఉండి విధులను జాగ్రత్తగా నిర్వర్తించాలని అన్నారు. రాజకీయ పార్టీలకు సంబంధించిన హోర్డింగులు, పోస్టర్లతోపాటు ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థల గోడలపై ఏవైనా రాతలు ఉంటే తొలగించాలని ఆదేశించారు. ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే చర్యలపై నిఘా ఉంచాలన్నారు. ఓటరు జాబితాను మరోమారు నిశితంగా పరిశీలించాలని, ఎక్కడైనా ఇబ్బందులు ఉన్నట్లు గమనిస్తే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఓట్ల లెక్కింపు కోసం రెవెన్యూ డివిజన్ కేంద్రాల వారీగా కౌంటింగ్ హాళ్లను గుర్తించాలన్నారు. అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్, సబ్ కలెక్టర్లు వికాస్ మహతో, అభిగ్యాన్ మాల్వియ, ట్రెయినీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్ మావి, జెడ్పీ సీఈవో సాయాగౌడ్, ఆర్డీవో రాజేంద్రకుమార్, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్, నోడల్ అధికారులు, డీఎల్‌పీవోలు పాల్గొన్నారు.

రాజకీయ పార్టీలు సహకరించాలి

ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించేందు కు రాజకీయ పార్టీలు సహకరించాలని కలెక్టర్ టి వినయ్ కృష్ణారెడ్డి కోరారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ మంగళవారం సమావేశమైన కలెక్టర్ ఎన్నికల నిర్వహణ అంశాలపై మాట్లాడారు. ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు సహకారం అందించాలని కోరారు.

ఉపాధ్యాయుల్లో టెట్ గుబులు

- రెండేళ్లలో ఉత్తీర్ణత కావాలన్న సుప్రీం కోర్టు
- లేదంటే సర్వీస్ నుంచి తొలగింపు
- ఆందోళన చెందుతున్న టీచర్లు



నిజామాబాద్‌అర్బన్: ప్రభుత్వ ఉపాధ్యాయులు తప్పనిసరిగా టెట్ (టీచర్స్ ఎలిజిబిలిటి టెస్ట్) ఉత్తర్ణత కావాల్సిందేనని సుప్రీం కోర్టు ఇటీవల తీర్పు వెలువరించడంతో టీచర్లు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం వెంటనే దీనిపై రిట్ పిటిషన్ వేయాలని గత కొన్ని రోజులుగా డిమాండ్ చేస్తున్నారు. అలాగే 2010కి ముందు నియమితులైన టీచర్లందరూ రెండేళ్లలో టెట్ అర్హత సాధించాలని సుప్రీం పేర్కొంది. రాష్ట్ర ప్రభుత్వం 2012, 2017, 2024లో చేపట్టిన డీఎస్సీ నియామకాల్లో టెట్‌ను అమలు చేసింది.

ఎలా సాధ్యమంటున్న టీచర్లు

టెట్ మార్గదర్శకాలు తమకు వర్తించవని, సుప్రీం కోర్టు తీర్పు రూల్స్‌కు విరుద్ధమని విద్యా హక్కు చట్టం రాకముందు వివిధ నోటిఫికేషన్ల ద్వారా నియమితులైన ఉపాధ్యాయులు అంటున్నారు. ఇది ఎలా సాధ్యమని ప్రశ్నిస్తున్నారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రిట్ పిటిషన్ వేయాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుతం కొందరు నిరుద్యోగులే ఒకటి కంటే ఎక్కువసార్లు రాస్తేనే ఉత్తీర్ణత సాధిస్తున్నారని, అలాంటిది 10 నుంచి 15 సంవత్సరాల ఉపాధ్యాయ వృత్తి కొనసాగుతున్న వారు టె ట్ ఎలా పాస్ అవుతామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యాహక్కు చట్టానికి ముందే ఉపాధ్యాయ వృత్తిలో చేరిన వారికి టెట్ మినహాయింపు ఇవ్వాలని, పదోన్నతులు పొందే వారికి టెట్ అమలు చేయాలని ఉపాధ్యాయ సంఘాలు నాయకులు కోరుతున్నారు. విద్యా హక్కు చట్టంలో సవరణ చేయాలంటున్నారు. అయితే చట్ట సవరణ అధికారం కేవలం కేంద్ర ప్రభుత్వానికి మాత్రమే ఉండగా, అనేక రాష్ట్రాలు సుప్రీంలో రిట్ పిటిషన్ దాఖలు చేశాయి.

మినహాయింపు ఇవ్వాలి



2010కి ముందు ఉద్యోగంలో ప్రవేశించిన ఉపాధ్యాయులను ఉద్యోగంలో కొనసాగించేందుకు మానవతా దృక్పథంతో టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలి. ఆ దిశగా కేంద్ర ప్రభుత్వం చట్టాన్ని సవరించాలి. – జి శ్రీనివాస్, పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు

పాఠశాలలు 1176.. టీచర్లు 4576..

జిల్లాలో 1176 పాఠశాలలు, 4576 మంది టీచర్లు ఉన్నారు. ఇందులో టెట్ ఉత్తీర్ణత లేని వారు 1671 మంది ఉన్నారు. విద్య హక్కు చట్టం సెక్షన్ 23(1) ప్రకారం 1 నుంచి 8 తరగతులకు బోధించే ఉపాధ్యాయులకు టెట్ తప్పనిసరి చేస్తూ ఎన్‌సీటీఈ (నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్) 2010 ఆగస్టు 23న నోటిఫికేషన్ విడుదల చేసింది.అనంతరం 2014 నవంబర్ 12న పైస్థాయి పదోన్నతుల కోసం టెట్ తప్పనిసరి చేస్తూ ఎన్‌సీటీఈ మరో నోటిఫికేషన్ విడుదల చేసింది. చాలా రాష్ట్రాల్లో టెట్ ఉత్తీర్ణత కాకుండా పదోన్నతులు ఇస్తుండడంతో కొందరు ఉపాధ్యాయులు కోర్టులో పిటిషన్ వేశారు. దీంతో టెట్ తప్పనసరి అంటూ కోర్టు పేర్కొంది. రానున్న రెండేళ్లలో టెట్ పాస్ కాకుంటే వెంటనే సర్వీస్ నుంచి తొలగించాలని సుప్రీంకోర్టు పేర్కొంది. దీంతో ఉపాధ్యాయులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

రిట్ పిటిషన్ వేయాలి



సుప్రీంకోర్టు తీర్పుపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రిట్ పిటిషన్ వేయాలి. స్టే ఆర్డర్ తీసుకువస్తే బాగుంటుంది. 2010కి ముందు నియమితులైన ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలి. – సురేశ్, గెజిటెడ్ హెచ్‌ఎంల సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు

వన్య ప్రాణుల రక్షణకు చర్యలు

- రహదారుల వెంట అటవీ భూములకు కంచెలు
- ఉమ్మడి జిల్లాలో పది కిలోమీటర్ల పరిధిలో ఏర్పాటు
- ఎనిమిది ఫీట్ల ఎత్తులో పటిష్టమైన చైన్‌లింక్ ఫెన్సింగ్
- రోడ్డు దాటుతూ వాహనాలు ఢీకొని మరణిస్తున్న చిరుతలు, ఇతర వన్య ప్రాణులు



మేలో చంద్రాయన్‌పల్లి వద్ద హైవేపై మృతి చెందిన చిరుత



గత వేసవిలో తిర్మన్‌పల్లి వద్ద హైవేపై మృతి చెందిన ఎలుగుబంటి



హైవే పక్కన ఏర్పాటు చేయనున్న కంచె(ప్రతీకాత్మక చిత్రం)

ఇందల్వాయి: జాతీయ రహదారుల వెంట రోడ్డు దాటుతూ వాహనాలు ఢీ కొట్టి ఏటా పదుల సంఖ్యలో వన్య ప్రాణులు మృతి చెందుతున్నాయి. వీటి రక్షణకు అటవీ శాఖ వినతి మేరకు నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా రహదారుల వెంట ఉన్న అటవీ భూములకు ఇరువైపులా కంచెల ఏర్పాటుకు నిర్ణయం తీసుకుంది.

నాలుగు చిరుతలు, ఒక ఎలుగు..

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో ఉన్న 44వ నంబరు జాతీయ రహదారి వెంబడి ముఖ్యంగా కామారెడ్డి జిల్లా సదాశివ్‌నగర్ మండలం దగ్గి ప్రాంతం నుంచి ఇందల్వాయి మండలం తిర్మన్‌పల్లి శివారులోనే గత ఎనిమిదేళ్లలో ఐదు చిరుతలు, ఒక ఎలుగుబంటి రహదారిపై రాత్రి వేళల్లో రోడ్డు దాటుతూ గుర్తు తెలియని వాహనాలు ఢీకొని మృత్యువాత పడ్డాయి. అందుకే ఈ ప్రాంతంలో వన్యప్రాణులు రోడ్డు పైకి రాకుండా కంచెల ఏర్పాటుకు చర్యలు చేపట్టారు.

ఆహారం కోసం..

ఆహారం, నీటి కొరత వల్ల కొత్త ఆవాసాలను వెతుక్కుంటూ వన్య ప్రాణులు వాటి పరిధి దాటి రోడ్లపైకి, జనావాసాల్లోకి వస్తున్నాయి. ఈ క్రమంలో ప్రమాదాలకు గురై మరణిస్తున్నాయి. అవి ఎట్టి పరిస్థితుల్లో అడవుల ద్వారా రోడ్లపైకి రాకుండా 8 ఫీట్ల ఎత్తులో పటిష్టమైన చైన్‌లింక్ ఫెన్సింగ్‌ను ఏర్పాటు చేయనున్నారు. దీనివల్ల వన్యప్రాణులు అడవి దాటడానికి, దూకడానికి కాని వీలుపడదు. ఈ చర్యల వల్ల వన్యప్రాణులు రోడ్డు ప్రమాదాలకు గురికాకుండా అడ్డుకోనున్నారు. ఇక్కడ మంచి ఫలితాలు వస్తే రాష్ట్రమంతట జాతీయ రహదారుల వెంట అడవులు ఉన్న ప్రతిచోట రెండు వైపుల ఫెన్సింగ్ వేయనున్నారు.

పైలట్ ప్రాజెక్ట్‌గా ఎన్‌హెచ్ -44

రహదారుల వెంట అటవీ భూములకు కంచెలు ఏర్పాటు చేయడంలో పైలట్ ప్రాజెక్ట్‌గా రాష్ట్రంలో మొదట 44వ నంబరు జాతీయ రహదారిని ఎంచుకున్నారు. ఇందులో ముఖ్యంగా గతంలో ఎక్కువ వన్య ప్రాణులు మృతి చెందిన కామారెడ్డి–నిజామాబాద్ మార్గ మధ్యలో ఐదు కిలోమీటర్ల మేర అటవీ ప్రాంతాన్ని గుర్తించి గ్రౌండ్ వర్కింగ్ పనులు చేయడంలో అటవీ, రహదారుల అధికారులు నిమగ్నమయ్యారు.

చర్యలు వేగవంతం



అటవీ శాఖ అభ్యర్థనను పరిగణనలోకి తీసుకొని హైవే అథారిటి ఆఫ్ ఇండియా ఫెన్సింగ్ ఏర్పాటుకు చర్యలు చేపట్టడం హర్షనీయం. ఉమ్మడి జిల్లాలో మంచిప్ప, చంద్రాయన్‌పల్లి రిజర్వ్ ఫారెస్ట్ ఏరియాల్లో ఐదు కిలోమీటర్ల పొడవునా అడవులు ఉన్నాయి. రెండు వైపులా సుమారుగా పది కిలోమీటర్ల మేర ఫెన్సింగ్ ఏర్పాటుకు అటవీ, హైవే అథారిటీ అధికారులు గ్రౌండ్ వర్క్ చేస్తున్నారు. దసరా తర్వాత ఫెన్సింగ్ వేసే పనులు ప్రారంభం అయ్యే అవకాశాలు ఉన్నాయి. వాహనదారులు సైతం అటవీ ప్రాంతాల్లో నిర్దేశించిన వేగ నియంత్రణ పాటించాలి. – వికాస్ మీనా, జిల్లా ఫారెస్ట్ అధికారి

క్లుప్తంగా

శోభాయాత్ర శాంతియుతంగా జరుపుకోవాలి



రుద్రూర్: దుర్గామాత నిమజ్జన శోభాయాత్రను శాంతియుతంగా జరుపుకోవాలని కోటగిరి ఎస్సై సునీల్ సూచించారు. కోటగిరి పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం దుర్గాదేవి శరన్నవ రాత్రి ఉత్సవ కమిటీ సభ్యులతో శాంతి కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఎస్సై మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉందని, డీజేలు పెట్టవద్దని సూచించారు.

పోలీసుల విస్తృత తనిఖీలు



ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణంలో మంగళవారం రాత్రి నిషేధిత మాదక ద్రవ్యాలపై ఎస్‌హెచ్‌వో సత్యనారాయణగౌడ్ ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. పట్టణంలోని పాతబస్టాండ్‌లో ప్రయాణికుల బ్యాగులు, హోటల్స్‌లలో, పాన్ షాపులతోపాటు పలు దుకాణాల్లో నిషేధిత మత్తు పదార్థాలు, ఇతర చట్టవిరుద్ధ వస్తువులను గుర్తించేందుకు శిక్షణ పొందిన స్నిపర్ డాగ్‌ల ద్వారా పరిశీలించారు.

కానిస్టేబుల్ సస్పెన్షన్

మోపాల్: మోపాల్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వర్తించే కానిస్టేబుల్ గంగాప్రసాద్‌ను పోలీస్ కమిషనర్ సాయి చైతన్య సస్పెండ్ చేసినట్లు సీఐ సురేశ్‌కుమార్ మంగళవారం తెలిపారు. పోలీస్‌స్టేషన్‌కు సంబంధించి గోప్యంగా ఉంచాల్సిన సమాచారాన్ని చేరవేయడం, విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో శాఖాపరమైన చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. విలువైన సమాచారాన్ని ఇతరులకు చేరవేస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ సురేశ్‌కుమార్ హెచ్చరించారు.

నిజాంసాగర్‌లోకి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

నిజాంసాగర్: నిజాంసాగర్ ప్రాజెక్టులోకి వరద కొనసాగుతోంది. మంగళవారం 1,00,963 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోందని అధికారులు తెలిపారు. ప్రాజెక్టు 15 వరద గేట్లను ఎత్తి 70,648 వేల క్యూసెక్కుల నీటిని మంజీర నదిలోకి వదులుతున్నారు.

సమస్య ఏదైనా వాట్సాప్‌లో పరిష్కారం

- సోషల్ మీడియాలో ప్రభుత్వ శాఖలు
- వాట్సాప్, యాప్‌ల ద్వారా సలహాలు, సూచనలు



కమ్మర్‌పల్లి: సామాజిక మాధ్యమాల వినియోగంలోకి ప్రభుత్వ శాఖలు చేరాయి. సామాజిక మాధ్యమాల వేదికగా సలహాలు, సూచనలు ఇస్తూ, సమస్యలకు పరిష్కార మార్గాలు చూపుతూ ప్రజలకు చేరువవుతున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్మార్ట్ సేవలతోపాటు యాప్‌లను అందుబాటులోకి తీసుకువచ్చి శాఖల వారీగా ఒక నెంబర్‌ను కేటాయించాయి. అందులో మెసేజ్ చేస్తే చాలు.. అవసరమైన సలహాలు పొందడంతోపాటు సమస్యలు చెప్పుకొనే అవకాశం కల్పించారు. మరికొన్ని శాఖల్లో ఫిర్యాదు చేస్తే తక్షణమే పరిష్కరించి తిరిగి వినియోగదారులకు సమాచారం అందించేలా యాప్‌లను రూపొందించారు.

సాగు సలహాలు, సూచనలకు..

వ్యవసాయ శాఖ తాజాగా వాట్సాప్ ఛానల్‌ను అందుబాటులోకి తెచ్చింది. వ్యవసాయ శాఖ లింకును క్లిక్ చేయడంతో రైతులు ఛానల్లో చేరే వీలుంది. వ్యవసాయ సమాచారంతోపాటు ప్రభుత్వ పథకాలు, రాయితీ వివరాలు, పంటల సస్యరక్షణ, సీజన్ల వారీగా సూచనలు, వాతావరణ హెచ్చరికలు, కీటక నియంత్రణ, మార్కెట్ ధరలు, రైతునేస్తం కార్యక్రమాలు తదితర వాటిని ఎప్పటికప్పుడు తెలుసుకునే అవకాశం ఉంది.

వాట్సాప్ ఛానల్ : లింక్ ద్వారా చేరాలి. వ్యవసాయాధికారుల వద్ద ఉంటుంది.



సాంకేతికత సాయంతో కేవీకే..

జిల్లాలోని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు సీజన్ల వారీగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వాతావరణ సూచనలు, తదితర వాటిని నేరుగా రైతుల సెల్‌ఫోన్‌కు సందేశం రూపంలో పంపించేలా ఏర్పాట్లు చేశారు. సమాచారం పొందాలనుకునే రైతులు ముందుగా తమ పేరు, పూర్తి వివరాలు, ఫోన్ నంబర్లను కృషి విజ్ఞాన కేంద్రంలో నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. జిల్లాలో వ్యవసాయ సమాచారం నిమిత్తం ప్రస్తుతం 100కు పైగా వాట్సాప్ గ్రూపులు ఉన్నాయి. అందులో 10 వేల మందికి పైగా రైతులకు సమాచారం వెళ్తుందని రుద్రూర్ కృషి విజ్ఞాన కేంద్ర ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ విజయ్‌కుమార్ తెలిపారు.

వాట్సాప్ నంబర్: 8333818266

కంటి సంరక్షణకు నేషనల్ హెల్ప్‌లైన్..

కంటి సమస్యలు, సంరక్షణకు అవసరమయ్యే సలహాలు, సూచనలు పొందేందుకు జాతీయ స్థాయిలోని ప్రముఖ నేత్ర వైద్యుల బృందం తాజాగా జాతీయ హెల్ప్‌లైన్‌ను ప్రవేశపెట్టింది. కంటి సమస్యలతో బాధ పడుతున్నవారికి టెలిఫోన్, లేదా వీడియో కాలింగ్ ద్వారా వైద్య నిపుణులు చికిత్సకు సంబంధించిన సలహాలు, సూచనలు ఉచితంగా అందిస్తారు.

హెల్ప్‌లైన్ నంబర్: 18001037100



విద్యుత్ శాఖ ఫిర్యాదుల కోసం...



తెలంగాణ నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్(టీజీఎన్పీడీసీఎల్) తన వినియోగదారుల ఫిర్యాదుల కోసం మొబైల్ వాట్సాప్ నెంబర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఫిర్యాదు చేయాలనుకునే వినియోగదారులు సర్వీస్ నెంబర్‌ను నమోదు చేయగానే వివరాలు వెల్లడవుతాయి. చేసిన ఫిర్యాదుకు సంబంధించి ఒక ఐడీ వస్తుంది. ఆ వివరాలు వెంటనే వినియోగదారులకు మెసేజ్ రూపంలో అందుతాయి. ఫిర్యాదు ఏ స్థాయిలో ఉందనేది తెలుసుకోవచ్చు. సమస్య పరిష్కరించిన తర్వాత వినియోగదారునికి ఐవీఆర్ఎస్ కాల్ వస్తుంది. ఫీడ్ బ్యాక్ ఇవ్వమని అడుగుతారు.

వాట్సాప్ నంబర్ : 7901628348

శ్రీమాత్రే నమః

నిజామాబాద్ రూరల్ : శ్రీదుర్గాదేవీ నవరాత్రోత్సవాలు జిల్లా వ్యాప్తంగా వైభవంగా జరుగుతున్నాయి. మంగళవారం అమ్మవారు దుర్గాదేవి, సిద్ధిదాత్రి తదితర అలంకారాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. పలు చోట్ల యజ్ఞాలు, యాగాలు నిర్వహించారు. నగరంలోని ఆర్యనగర్ అభయ వీరహనుమాన్ మందిర కమిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన మండపంలో నవ దుర్గ వేషధారణలో చిన్నారులు ఆకట్టుకున్నారు.



ఆర్యనగర్‌లోని దుర్గాదేవి మండపంలో నవదుర్గ వేషధారణలో చిన్నారులు

శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో పేరిణి నాట్య ప్రదర్శన

బోధన్: తిరుపతి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో కొనసాగుతున్న శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో సోమవారం సాయంత్రం జిల్లాకు చెందిన ధనిత్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో పేరిణి సతీశ్ బృందం నాట్య ప్రదర్శన ఇచ్చారు. జిల్లా కేంద్రానికి చెందిన నాట్య గురువు ఆధ్వర్యంలో 25 మంది కళాకారులు ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు. నీల, యశశ్రీ, హర్షిత, లక్ష్మీవైష్ణవి, లక్ష్మి, సుమీష, త్రిశాల, హాసిని, బీ.హర్షిత, సాయిశ్రద్ధ తదితరులు పేరిణి నాట్యాన్ని ప్రదర్శించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా టీటీడీ సంగీత కళాశాల ఆధ్వర్యంలో 10 రాష్ట్రాల నుంచి 463 మంది నృత్య కళాకారులతో కూడిన 21 బృందాలు పాల్గొనగా, అందులో జిల్లాకు చెందిన పేరిణి నాట్య బృందం ఒకటి. ఈ సందర్భంగా నాట్య గురువు సతీశ్ మాట్లాడుతూ ఈ అవకాశం దక్కడం గొప్ప గౌరవమని, కళాకారులందరూ సమన్వయంతో ప్రదర్శనను విజయవంతం చేశారని హర్షం వ్యక్తంచేశారు.



తిరుమల మాడవీధుల్లో జిల్లాకు చెందిన సతీశ్ పేరిణి నాట్య బృందం

లక్ష్మీనర్సమ్మ అంత్యక్రియలు పూర్తి

- హాజరైన అర్బన్, ఆర్మూర్ ఎమ్మెల్యేలు ధన్‌పాల్, పైడి రాకేశ్ రెడ్డి

నిజామాబాద్ రూరల్: నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతి రెడ్డి తల్లి లక్ష్మీనర్సమ్మ అంత్యక్రియలు మంగళవారం పూర్తయ్యాయి. కంఠేశ్వర్ బైపాస్‌లోని అశోకా టౌన్‌షిప్‌లో ఉన్న ఎమ్మెల్యే స్వగృహం నుంచి గూపన్‌పల్లిలోని వైకుంఠధామం వరకు జరిగిన అంతిమయాత్రలో భారీ సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు తరలివచ్చారు. అంతకుముందు నిజామాబాద్ అర్బన్, ఆర్మూర్ ఎమ్మెల్యేలు ధన్‌పాల్ సూర్యనారాయణ, పైడి రాకేశ్ రెడ్డి, విత్తనాభివృద్ధి డెవలప్‌మెంట్ చైర్మన్ అన్వేశ్ రెడ్డి, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహర్ బిన్‌హందాన్, రైతు కమిషన్ చైర్మన్ గడుగు గంగాధర్, మానాల మోహన్‌రెడ్డి, యెండల లక్ష్మీనారాయణ, మండవ వెంకటేశ్వర్‌రావు, మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, పీసీసీ డెలిగేట్ బాడ్సి శేఖర్‌గౌడ్ తదితరులు లక్ష్మీనర్సమ్మ పార్థివదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఎమ్మెల్యే భూపతి రెడ్డిని ఓదార్చారు. వర్ధనపేట్ ఎమ్మెల్యే నాగరాజు ఫోన్ ద్వారా భూపతిరెడ్డిని పరామర్శించారు.



ఎమ్మెల్యే భూపతిరెడ్డిని పరామర్శిస్తున్న ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి తదితరులు

బాండ్ పేపర్లను నమ్మే పరిస్థితి లేదు

- కేసీఆర్ పాలనలో యూరియా కొరత రాలేదు
- భవిష్యత్ బీఆర్ఎస్‌దే..
- మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

సుభాష్‌నగర్ : బాండ్ పేపర్ల సంగతి జిల్లా ప్రజలందరికీ తెలుసని, ప్రస్తుతం బాండ్ పేపర్లను నమ్మే పరిస్థితి లేదంటూ ఎంపీ అర్వింద్‌ను ఉద్దేశించి మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి విమర్శించారు. మంగళవారం భీమ్‌గల్ పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రశాంత్‌రెడ్డి మాట్లాడారు. బీఆర్ఎస్ పని అయిపోయిందని, ఆ పార్టీ ఉండదని అర్వింద్ బాండ్ పేపర్ రాసిస్తా అంటున్నాడని తెలిపారు. బాండ్ పేపర్ పేరుతో ఎంపీ ఒకసారి చేసిన మోసాన్ని ప్రజలు మర్చిపోలేరని, అందుకే బాండ్ పేపర్లను నమ్మే పరిస్థితి లేదన్నారు. అర్వింద్ తన స్థాయిని తెలుసుకుని మాట్లాడాలని సూచించారు. బీఆర్ఎస్ పార్టీ అంటే ఏంటో ఒకసారి బడా భీమ్‌గల్‌కు వచ్చి చూడాలని సవాల్ విసిరారు. పసుపు రైతులను మోసం చేస్తున్న చరిత్ర ఎంపీదని, పసుపు బోర్డుకు ఒక నేమ్ బోర్డు ఉంది తప్ప పంటకు మద్దతు ధర ఇంకా తేలేదని ఆరోపించారు. బోర్డు రాక ముందు రూ.10వేలు పలికిన ధర ప్రస్తుతం రూ.6వేలకు పడిపోయిందని విమర్శించారు. దేశం కోసం అని నమ్మి.. మోదీని చూసి రాష్ట్రంలో 8 మంది బీజేపీ ఎంపీలను గెలిపిస్తే.. రైతులకు కనీసం యూరియా బస్తాలు ఇప్పించరా? అని ప్రశ్నించారు. 8 మంది కాంగ్రెస్, 8 మంది బీజేపీ ఎంపీలను గెలిపిస్తే రైతులు యూరియా కోసం ఇబ్బందులు పడ్డారని ఆవేదన వ్యక్తంచేశారు. కేసీఆర్ పాలనలో ఏనాడూ యూరియా కొరత రాలేదని తెలిపారు. ఓటేసి గెలిపిస్తే ఎవరు ఏం చేస్తున్నారో ప్రజలు అన్ని గమనిస్తున్నారని, మోదీతో రాష్ట్రానికి, అర్వింద్‌తో జిల్లాకు ఒరిగిందేమీ లేదని, రాబోయే ఎన్నికల్లో ప్రజలు తప్పకుండా బుద్ధి చెప్తారని అన్నారు.

ట్రాన్స్‌కోను ముంచిన ‘మంజీర’

- వరద పోటెత్తడంతో నీటమునిగిన ట్రాన్స్‌ఫార్మర్లు, దెబ్బతిన్న స్తంభాలు
- సుమారు రూ.20 లక్షల నష్టం



మంజీర పరీవాహక ప్రాంతంలో దెబ్బతిన్న ట్రాన్స్‌ఫార్మర్



నాగిరెడ్డిపేట శివారులో నీటమునిగిన ట్రాన్స్‌ఫార్మర్

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని మంజీర పరివాహక ప్రాంతంలో నదికి వరద పోటెత్తడంతో ట్రాన్స్‌కోకు భారీ నష్టం వాటిల్లింది. గతనెలాఖరులో కురిసిన భారీ వర్షాలతో ఎగువ నుంచి వచ్చిన వరదనీటి ప్రవాహానికి మండలంలోని ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలు నేలకూలాయి. దీంతో విద్యుత్‌శాఖకు సుమారు రూ.20 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు ట్రాన్స్‌కో అధికారులు తెలిపారు. మండలంలోని 131 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతినడంతో పాటు సుమారు 200 విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయని అధికారులు తెలిపారు. అలాగే మండలంలోని గోలిలింగాల, చీనూర్, వాడి, నాగిరెడ్డిపేట, లింగంపల్లికలాన్, వెంకంపల్లి, తాండూర్, మాటూర్, మాసాన్‌పల్లి, ఆత్మకూర్ తదితర గ్రామాల శివారుల్లోని పంట పొలాలు నీటమునిగాయి. కాగా, వరదనీటి నుంచి బయటపడ్డ పంటలను గట్టెక్కించాలనే ఉద్దేశ్యంతో తాత్కాలికంగా రెండు 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసి వ్యవసాయ బోరుబావులకు కరెంట్ సరఫరా చేశారు. దీంతో పాటు సుమారు 80 ట్రాన్స్‌ఫార్మర్లకు మరమ్మతులు చేపట్టి తిరిగి బిగించారు. సుమారు నెలరోజులుగా పంటపొలాలు వరద నీటిలోనే ఉండడంతో మిగిలిన ట్రాన్స్‌ఫార్మర్లకు మరమ్మతులు చేపట్టలేకపోతున్నారు. వరదనీరు పూర్తిగా తొలగిపోయిన తర్వాత నీటమునిగిన ట్రాన్స్‌ఫార్మర్లకు మరమ్మతులు చేపట్టడంతోపాటు నేలకూలిన స్తంభాలను సరిచేస్తామని ట్రాన్స్‌కో అధికారులు పేర్కొంటున్నారు.

అధిక వర్షాలతో పరేషాన్

- పంటలను వెంటాడుతున్న వాన
- దెబ్బతిన్న మొక్కజొన్న, సోయా
- ఆందోళన చెందుతున్న రైతులు

బాల్కొండ: జిల్లాలోని పలు ప్రాంతాల్లో రైతులను అధిక వర్షాలు ఇబ్బందుల్లో పడేశాయి. ఇటీవల కురిసిన వర్షాలతో భూగర్భ జలాలు అధికమై పంట భూముల్లో నీరు ఉబికి వస్తుంది. భూముల్లో తేమ శాతం అధికంగా ఉండటంతో పంటల ఎదుగుదల లేక రైతులు ఆందోళన చెందుతున్నారు. నిత్యం వర్షాలు కురుస్తుండటంతో పంట దిగుబడులు తడిసి ముద్దవుతున్నాయి. అతివృష్టితో పంటలను ఎలా కాపాడుకోవాలో తెలియక రైతులు తికమకపడుతున్నారు.

తడుస్తున్న పంట దిగుబడులు

సెప్టెంబర్ చివరిలో సైతం వర్షాలు కురుస్తుండటంతో చేతికొచ్చిన మొక్కజొన్న, సోయాలు తడిసిపోతున్నాయి. నూర్పిడి చేసి ఆరబెట్టిన మక్కలు ముక్కిపోతున్నాయి. తడిసిన మక్కలను ఆరబెట్టడంలో రైతులు నిమగ్నమయ్యారు. మరోవైపు వర్షం కురుస్తుండడంతో వ్యాపారులు ధరలు తగ్గిస్తున్నారు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

పసుపు పంటకు తేమ ఎఫెక్ట్..

అధిక పెట్టుబడి, గంపెడు ఆశలతో సాగు చేసే పసుపు పంట వర్షాలతో తీవ్రంగా దెబ్బతింటుంది. మోతాదు వర్షంతోనే పసుపు పంటకు మేలు. నిత్యం వర్షాలు కురుస్తుండటంతో నేలల్లో తేమ శాతం అధికమై పసుపు పంటకు దుంపకుళ్లు సోకుతుంది. అంతే కాకుండా ఎదుగుదల లేకుండా పోతోంది. ఇప్పటి వరకు 50 శాతం మేర పసుపు పంటలకు నష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



రెంజర్లలో వర్షానికి తడిసి ముక్కిపోయిన మక్కలు

ప్రభుత్వం ఆదుకోవాలి



ఈ ఏడాది పచ్చి కరువు వచ్చి పడింది. రోజూ వర్షం పడుతుండటంతో భూములన్నీ తడిగా ఉన్నాయి. పసుపు పంట నీరు పట్టి పోయింది. దుంపలు తీస్తే వాసన వస్తుంది. ఇంకా వానలు కురుస్తునే ఉన్నాయి. మక్కలు ముక్కిపోతున్నాయి. ప్రభుత్వమే మమ్మల్ని ఆదుకోవాలి.

– నడ్కుడ నర్సయ్య, రైతు, రెంజర్ల

బీఎస్ఎన్ఎల్ సమృద్ధి జీపీగా వేల్పూర్



వేల్పూర్: బీఎస్ఎన్ఎల్ సమృద్ధి గ్రామ పంచాయతీగా వేల్పూర్ ఎంపికైనట్లు సంస్థ హైదరాబాద్ నోడల్ అధికారి నంబి మృదుపాణి పేర్కొన్నారు. మంగళవారం ఆమె వేల్పూర్ గ్రామ పంచాయతీలో బీఎస్ఎన్ఎల్ సమృద్ధి ద్వారా అందించే సేవలను వెల్లడించారు. సమృద్ధి ద్వారా అంతరాయం లేకుండా ఇంటర్నెట్ సేవలు లభిస్తాయన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు, వ్యక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నిజామాబాద్ సబ్ డివిజన్ ఇంజినీర్ హనుమాన్‌సింగ్, మోర్తాడ్ ఎస్‌డీఈ చిన్నయ్య, నెట్‌వర్క్ ఇంజినీర్ సుమన్‌రెడ్డి, మోర్తాడ్ ఫీల్డ్ టెక్నీషియన్ సతీశ్‌కుమార్, జేఈ రాకేశ్‌కుమార్, వేల్పూర్ టీబీపీ సుధాకర్ పాల్గొన్నారు.

నిమజ్జన ఏర్పాట్లు చేయాలి



నవీపేట: మండలంలోని యంచ గోదావరి నది బ్రిడ్జిపై దుర్గామాత నిమజ్జన ఏర్పాట్లను పకడ్బందీగా చేయాలని బీజేపీ నాయకులు కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డికి జిల్లా కేంద్రంలో మంగళవాం వినతిపత్రం సమర్పించారు. దూర ప్రాంతంలోని దుర్గామాత విగ్రహాలను యంచ గోదావరి నదిలో నిమజ్జనం చేస్తారని, ఇంత వరకు ఎలాంటి ఏర్పాట్లు చేయలేదని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యులు వడ్డి మోహన్‌రెడ్డి, మండల నాయకులు ద్యాగ సరిన్, రాజేందర్‌గౌడ్, రాజశేఖర్, భూషన్ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

మాక్లూర్: అడ్డుగా వచ్చిన గేదెలను తప్పించబోయి ఓ యువకుడు బైక్‌పై నుంచి కిందపడి మృతి చెందిన ఘటన మండలంలోని మాదాపూర్‌లో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. మాక్లూర్ ఎస్సై రాజశేఖర్ కథనం మేరకు... నందిపేట మండలం వెల్మల్ గ్రామానికి చెందిన మద్దెపల్లి మోహన్ (44) ద్విచక్ర వాహనంపై రాత్రి 7 గంటలకు పని నిమిత్తం నిజామాబాద్ వెళుతున్నాడు. మాదాపూర్ గ్రామం వద్ద పాడి గేదెలను తప్పించబోయి ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. తలకు బలమైన గాయాలు కావటంతో మోహన్ అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కుక్కల దాడిలో 17 మందికి గాయాలు

- చిన్నారి పరిస్థితి విషమం



ఆర్మూర్ టౌన్: ఆర్మూర్ పట్టణంలోని రాజారాంనగర్ శివారు ప్రాంతం, వెంకటేశ్వర కాలనీ, ఔటిగల్లీల్లో పిచ్చి కుక్కల స్వైరవిహారం చేశాయి. మంగళవారం సుమారు 17 మందిపై దాడి చేశాయి. క్షతగాత్రులకు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో వైద్యులు చికిత్స నిర్వహించారు. కాగా, ఓ చిన్నారి పరిస్థితి విషమంగా ఉండడంతో జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

మాక్లూర్ : మండలంలోని కొత్తపల్లి శివారులో ఉన్న ఓ మామిడి తోటలో పేకాట స్థావరంపై మంగళవారం సాయంత్రం ఎస్సై రాజశేఖర్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది దాడి చేశారు. పేకాడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకొని రూ.4,620 నగదు, 4 ద్విచక్ర వాహనాలు, 5 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

ఉద్యోగులకు విరమణ తప్పదు

ఖలీల్‌వాడి: ఉద్యోగులకు పదవీ విరమణ తప్పదని, ఎలాంటి రిమార్క్ లేకుండా పనిచేయడం గొప్ప విషయమని సీపీ పోతరాజు సాయిచైతన్య పేర్కొన్నారు. జిల్లా పోలీస్ శాఖలో పదవీ విరమణ చేసిన ఎస్సైలు బాబూరావు, ఎండీ నసీరుద్దీన్, సీపీ ఆఫీస్ సూపరింటెండెంట్ వనజా రాణిలను మంగళవారం సీపీ ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రిటైర్డ్ ఉద్యోగులకు ఎలాంటి అవసరం ఉన్నా పోలీస్ శాఖ అందుబాటులో ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో అదనపు పోలీస్ కమిషనర్ (అడ్మిన్) బస్వారెడ్డి, ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ, స్పెషల్ బ్రాంచ్ సీఐ శ్రీశైలం, వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి, రూరల్ ఎస్సై ఎండీ ఆరీఫ్, రిజర్వ్ సీఐ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



రిటైర్డ్ అయిన సిబ్బందితో సీపీ సాయిచైతన్య

ముగిసిన జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు



పడ్కల్ తండా జట్టుకు బహుమతి అందజేస్తున్న నాయకులు

పెర్కిట్(ఆర్మూర్): ఆలూర్ మండలం మచ్చర్లలో గ్రామ యువత ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు సోమవారం రాత్రి ముగిశాయి. పోటీల్లో జిల్లా వ్యాప్తంగా 24 జట్లు పాల్గొన్నాయి. తుది పోరులో జక్రాన్‌పల్లి మండలం పడ్కల్ తండా విజేతగా నిలువగా, మచ్చర్ల రెండో స్థానంలో నిలిచింది.

విజేతలకు స్థానిక కాంగ్రెస్ నాయకుడు యెర్ర జితేందర్ రెడ్డి రూ.8,888 నగదు బహుమతిని అందజేశారు. కార్యక్రమంలో షేక్ సమీర్, వెల్మ రాజ్‌కుమార్, ఉప్పు గంగారెడ్డి, కొర్వ ప్రవీణ్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో చండీయాగం

- హాజరైన కలెక్టర్, సీపీ



పూజలు చేస్తున్న కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి, సీపీ సాయిచైతన్య

ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ మైదానంలో ఏర్పాటు చేసిన దుర్గా పరమేశ్వరీ మాత మందిరంలో మంగళవారం మహా చండీయాగం నిర్వహించారు. యాగానికి కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి, సీపీ పోతరాజు సాయిచైతన్యలు సతీమేతంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అదనపు డీసీపీలు బస్వారెడ్డి, రామచంద్రరావు, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్, ఆర్మూర్, బోధన్ సబ్ కలెక్టర్లు అభిజ్ఞాన్ మాల్వియ, వికాస్ మహతో, డీఎంహెచ్‌వో రాజశ్రీ, ట్రెయినీ కలెక్టర్, ఏసీపీలు, సీఐలు, ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.